పగడాలు

అప్పుడే పొద్దు వాలుతోంది. దూరాన రెండుకొం డల మధ్య, తన తీక్షణత అంతా కోలుపోయి సూర్యుడు రక్త బింబంలా వున్నాడు. కదిలే నునుమేఘాల నీడలు మధ్య మధ్యన గుండ్రని బింబంతో ఆకులలాగా, పువ్వులలాగా, చిన్ని చిన్ని కొండగుట్టల్లా, ఎర్రని అద్దంలో ప్రకృతి ప్రతి ఫలించినట్లు తోస్తున్నాయి. కావిరంగు మేడల్లో ప్రకృతి నాట్యమాడుతోంది.

అప్పుడే తలంటుకొని మేడమీద కొచ్చింది వాసంతి. ముడి విప్పుకుని తల ఆరపెట్టుకుంటో, అస్తమిస్తున్న సూర్యుడి శోభ తిలకిస్తో, పిట్టగోడ అంచున కూర్చున్నది. గాలికి ముంగురులు కదిలినప్పుడల్లా గుప్పున సాంబ్రాణి పరి మళం దిశలన్నీ వ్యాపిస్తోంది. వాసంతి తెల్లని మెడలో ఎప్పటివో పూర్వకాలపు పెద్దపెద్ద గుండ్రటి పగడాలు ఎర్రగా బరువుగా కదలుతున్నాయి... ఆ పగడపు కాంతిలో మీగడ లాంటి చెక్కిళ్లు సిగ్గుపడి కదిలినట్లు కనుపిస్తున్నాయి, ఎర్రని చీర, మెడలో పగడాలు, కుంకుమబొట్టూ, మల్లెమొగ్గల లాంటి గోళ్ళకు గోరింటాకూ, సంధ్యాకాంతితో పోటీపడుతూ అందులో లీనమైపోతున్నాయి.

వాసంతి హృదయం ఆవేళంత ఉత్సాహంగా మరె ప్పుడూ లేదు. ఎంత చల్లని రోజు... ఎంత చక్కని సంధ్య... వాసంతి హృదయం ఒక్కసారి ఆనందంతో పరవశమైంది.

కాని. మళ్ళీ వెంటనే ఏవో ఆలోచనలలో పడిపోయింది ఆమె... ...

ఎనిమిదేళ్ళ తరువాత ఇన్నాళ్ళకి మళ్ళా తను ఈ ఊరు వచ్చింది. తన చిన్నతనమంతా ఇక్కడే గడిచింది. ఈ ఊళ్ళో, ఈ ఇంట్లో అడుగడుగునా ఏవో ఎన్నో జ్ఞాపకాలు. చిన్ననాడు తను అనుభవించిన ఆవేదన, ఆశ, నిరాశ, సుఖమూ, సంతోషమూ, ఆతురత, కన్నీరూ అన్నీ మళ్ళీ నీడలల్లా మనస్సులో కదులుతున్నాయి. తోటలో తను ఏరుకున్న పొగడపూలూ, మర్రిచెట్టుక్రింద ఊగిన ఉయ్యాలా, వెన్నెట్లో, మేడమెట్ల దగ్గర, ఇసుక తిన్నెల్లో ఆడిన ఆటలూ, అన్నీ ఏవో కథల్లా జ్ఞాపకంవస్తున్నాయి. ప్రతి నిమిషం ఏదో ఒక ఘటన గుర్తుకువస్తూంది.

తెల్లవారుఝామున రైలుదిగి ఎద్దుబండిలో ఇంటికి వస్తోంటే, ఆ మువ్వల మ్రోతకి నిద్ర మైకంలా వచ్చేసింది. కేసరి పెళ్ళికి రాత్రిపూట రెండెడ్లబండిలో ఊగుతూపోతుంటే తన చుక్కల పట్టుపరికిణి గాలికి ఆడటం, పంకజం నవ్వు, ఆకలితో, నిద్రతో తను ఆవులించటం అన్నీ కలలా కళ్ళ ఎదుట కదిలాయి. గుమ్మందగ్గర బండిదిగి లోపలికి వస్తుంటే మాలతిపొద దగ్గర అనసూయా తనూ ఎర్రగులాబికోసం కీచులాడుకోవటం గుర్తుకువచ్చింది. ఇట్లాగే ఇంకా ఎన్నో ఎన్నో...

ఈ ఎనిమిదేళ్ళలో తన జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. ఒక్కొక్క మెట్టు ముందుకు సాగుతూ తన జీవితం పూర్ణవికాసం పొందింది. కలకత్తాలో నాలుగేళ్ళు

చక్కగా చదువుకొని తను బి. ఏ. ఫస్టున ప్యాసయింది. యూనివర్సిటీకే ఫస్టునవచ్చిందని నాన్న ఎంతో సంతోషించి పెద్ద టీపార్టీ ఇచ్చాడు. ఆ తరువాత డిస్ట్రిక్ట్ హెల్తాఫీసరు గారబ్బాయితో తనకి వివాహం అయింది. వాళ్ళు కట్నం ఏమీ అడుగలేదు. అయినా నాన్న ఎంతో డబ్బు ఖర్చు పెట్టి పెళ్ళి ఎంతో దర్జాగా, వైభవంగా చేశారు. అదృష్టం కలిసి, పెళ్ళి అయిన వెంటనే లక్నోలో తన భర్తకి మంచి ఉద్యోగం అయింది. తను అత్తవారింటికి వెళ్ళిపోయింది. ఆ తరువాత ఏడాదికే పాప పుట్టింది. ఆయనకి ప్రమోషనై పెద్ద ఉద్యోగమైంది. ఆర్థికంగా గాని, ఇంకోవిధంగాగాని తన కేలోటులేదు. ఏ బాధా లేదు. భర్త తనని పువ్వులలో పెట్టి పూజిస్తాడు. తనమాట కెప్పుడూ ఎదురు చెప్పడు. తను ఎంతో అదృష్టవంతురాలు... ఎంతో సుఖపడుతోంది. అందరూ అల్లానే అనుకుంటారు.

అయినా, అప్పుడప్పుడు ఏవో చిన్నప్పటి విషయాలు జ్ఞాపకంవచ్చినప్పుడల్లా మనస్సు కలతచెందుతుంది...

పాప పుట్టినప్పుడూ, ఆ తరువాత ఎన్నోసార్లు, ఈ ఊరు రావాలని ప్రయత్నించింది. కాని ఆరు నెలలకొక సారి ఆయనకి ట్రాన్స్ఫరవుతుండడంచేత, ఇంటిగొడవలతో ఎప్పుడూ వీలుపడలేదు. ఇన్నాళ్ళకి మళ్ళీ రాగలిగింది.

ప్రొద్దుగూకింది. ఆకాశమంతా నక్షత్రాలతో నిండి పోయింది. వెన్నెల బంగారంలా మెరుస్తో మూల మూలలా వ్యాపించింది. చంద్రుడు ఉత్సాహంగా నవ్వుతున్నాడు. వాసంతి క్రిందకు వెళ్ళి దువ్వెన తెచ్చుకొని, తల చిక్కుతీసి

వదులుగా జడ అల్లుకున్నది. అప్పుడే విరిసిన మల్లెపూలూ, ప్రొద్దుటి గులాబీలుఅన్నీ దండగాకట్టి తలనిండా పెట్టుకున్నది.

పాపనెత్తుకొని తల్లి మేడమీదకి వచ్చి అడిగింది.

'ఏమే! అన్నానికి వస్తావా?'

'తొందరేం? ... నాన్నగారినికూడా రానీ' అన్నది.

అమ్మ మళ్ళా అడిగింది, ఆకాశంకేసి చూస్తూ 'అతను ఎప్పుడు వస్తారు?'

'ఏమో! ... పండక్కి వస్తానన్నారు — సెలవు దొరికితే...'

అమ్మా, తనూ, మౌనంగా మామిడిచెట్టు పూతకేసి చూస్తూ కూర్చున్నారు కొంతసేపు. ఆ తరువాత పాపకి అన్నంపెట్టి డాబామీద పక్కవేసి పడుకోబెట్టింది. పాప నిద్ర పోతూంటే తనూ ప్రక్కనే పడుకుంది. ఏవో ఆలోచిస్తూ ... వెన్నెల చల్లగా ముఖంమీద పడుతోంది. కళ్ళకెదురుగుండా బంగారపు బంతిలా చంద్రుడు చిరునవ్వు నవ్వుకున్నాడు.

ఎన్ని వెన్నెలరాత్రులు, ఉషఃకాంతులు ఈ డాబామీద గడిచిపోయాయో, ఆనందంతో, దిగులుతో, పరిహాసంతో! చిన్నతనంలో, ఆరోజుల్లో, ఏమీ తోచనప్పుడల్లా డాబా మీదికి వచ్చికూర్చునేది. తమఇంటిచుట్టూ దూరాన చిన్న చిన్నకొండలూ, గుట్టలూ ఎన్నోవుండేవి. ఇంటి కెదురుగా అంతా పెద్ద పచ్చికబయలు, ఆ తరువాత అక్కడక్కడ ఎత్తుగా కొబ్బరిచెట్లు, వాటి వెనకాలే రెండు చిన్నకొండలు ఎడాపెడాగా వచ్చి మధ్యన కలుసుకున్నట్లు వుండేవి. ఆ కొండలమీదనుంచి, ఆరయేసరికి, రక్తవర్ణంతో సూర్యుడు

తొంగిచూచేవాడు. సాయంత్రం మళ్ళీ అక్కడే కొబ్బరి చెట్లమధ్యనుంచి చంద్రుడు పలుకరించేవాడు. రోజూ ఈ వింతలు చూస్తూ తను పరవశమయ్యేది.

నిద్రలో పాప వత్తిగిలింది. పాప తల తగిలి మెడలో పగడాలు హృదయానికి గట్టిగా ఒత్తుకున్నాయి. గుండెల్లో ఏదో బరువుగా తగిలింది. అబ్బ!...ఎన్నాళ్ళ నుంచి మోస్తోం దీ పగడాలు!...అవి కదలినప్పుడల్లా హృదయంలో ఏదో తీరనిబాధ, ఏదో వ్యథ...

తమ ఇంటి కెదురుగానే, ఆ పచ్చిక మైదానానికంతకీ లక్షుమన్న తాత దొక్కటే గుడిసె వుండేది. అవ్వా, అతనూ తల్లిలేని మనుమరాలు సీతా, ముగ్గురూ ఆ గుడిసెముందరే ఓ చిన్న చిల్లర దుకాణం పెట్టుకొని కాలం గడుపుతుండే వాళ్లు...పొద్దున బండి దిగుతూనే అతని గుడిసె, దుకాణం కనబడతాయేమోనని ఆశగా చూసింది. ఎక్కడా ఆనవాలు కూడా లేదు. ఆ మైదానంనిండా ఎన్నో కొత్త కొత్త రంగు రంగుల మేడలు, ఆకాశమెత్తున లేచాయి. దూరాన కొండ లుకూడా కనుపించటంలేదు. తనకి స్పృహకలిగింది.

పాపం లక్షుమన్నతాత చాలా మంచివాడు...తనంటే ఎంతో ప్రేమ...'బుల్లెమ్మగారు; బుల్లెమ్మగారు' అంటూ తనని నెత్తిన పెట్టుకునేవాడు. ఎంతో గొప్పగాచూచేవాడు. గుడిసెకెదురుగా ఆ పచ్చగడ్డిలో సీతా తనూ ఆడుకునేవాళ్లు ప్రొద్దస్తమానం; అప్పటికి తనకి ఏడెనిమిదేళ్ళుంటాయి. సీతకీ అంతే...ప్రొద్దున్నే నీళ్ళు పోసుకొని, తల దువ్వించు కొని, పట్టుగౌనుతో చక్కగా సింగారించుకొని వెళ్లేది తను.

చింకిరి జుట్టుతో, చినిగిన పరికిణీతో గుడిసెలోనుంచి వచ్చేది సీత. ఇద్దరూ ఆ గడ్డిలో ఎన్ని రకాల ఆటలో ఆడేవారు. గుజ్జనగూడు, గుడుగుడుగుంచంతో ఆరంభమై, బొమ్మల పెండ్లి, కాళ్ళాగజ్జతో సాంతమయ్యేవి; ఒక్కొక్కప్పుడు తను అన్నానికి వెళ్ళటం మరచిపోతుండేది. అమ్మ గుమ్మం లోకి వచ్చి కేకలుపెట్టి పిలుచుకుపోతుండేది.

మట్టిలో ఆడి ఆడి తను జుట్టు రేపుకుని, గౌను చింపుకుని ఇల్లు చేరుతుండేది. అమ్మ రోజూ కోప్పడుతూనే వుండేది, మట్టిలో ఆ ముష్టిపిల్లలతో ఆడుకోవద్దని. ఎన్నిసార్లో కసిరి చీవాట్లతో ఇంటికి లాక్కుపోతుండేది. కాని తను మాత్రం మళ్ళీ, నిమిషంలో, సందుచూచుకుని సీతదగ్గరికి చేరుతుండేది. అమ్మ విసిగి ఊరుకునేది.

దుకాణం బేరం లేనప్పుడల్లా లక్షుమన్నతాత వాళ్ల దగ్గరకు వచ్చి కూర్చుని కథలూ కబుర్లూ చెబుతుండేవాడు. సీతతోబాటు తనూ అతనిని 'తాతా' అనే పిలిచేది. అతనూ సీతకన్నా తననే ఎక్కువ గారాబం చేసేవాడు. తను ఇంట్లో ఆ మూలా ఈమూలా పడివున్న చిన్నచిన్న తగరుముక్కలూం కంచుకడ్డీలు తీసుకువెళ్ళి వెండి బంగారు ముక్కలని తాత కిస్తుండేది. ఆ పనికిరాని ముక్కలన్నీ అతను నిజంగా వెండి బంగారంవాటిలాగే అతి జాగ్రత్తగా తన సీనాశేకు డబ్బాలో దాచుకునేవాడు. వాటికి బదులుగా సీతకీ తనకీ పిప్పరమెంట్లూ, చాకిలెట్లూ, కిల్లీలు ఇస్తుండేవాడు. రోజూ అది ఒక ఆట అయిపోయింది. ఏదో చిల్లముక్క తను పట్టుకు వెళ్ళడం ఎంతో భద్రంగా అతను దాచుకోవడం, చాకిలెటు

నములుతూ ఏదో గొప్ప పని చేసినట్లు తను సంతోషించ డం... ఎప్పుడో ఓసారి అమ్మతో గూడా చెప్పేసింది. 'ఏమిటీ, వెండిబరిణలో వున్న బంగారపు గుళ్లన్నీ ఇచ్చేస్తున్నావా?' అంది అమ్మ? తను బిత్తరపోయింది. తెల్లమొహంవేసుకుని అన్నది:

'అబ్బే! అది కాదే!...నాకు దొరికినయ్!'

అమ్మ నమ్మలేదు. 'ఆ కొంపచాయకు పోవద్దంటే వినవుకదా' అని విసుక్కున్నది.

...ఇంకోసారి, ఓ రోజు, వాకిట్లోకి పగడాల అబ్బి వచ్చాడు. గంటసేపు బేరంచేసి, అమ్మ ఏరి ఏరి మూడు రకాల పగడాలు కొన్నది. చిన్నవి, పెద్దవి, మరీ పెద్దవి, ఎర్రగా ఎంతో అందంగా వున్నాయి. భరణిలోని బంగారు గుండ్లన్నీ కరిగించి అమ్మ శంకరయ్యచేత మాలలు చుట్టిం చింది. అవి వచ్చిన రోజునే తను అన్నింటిలోకి పెద్ద పగడాల హారం మెళ్లో వేసుకుంది. అమ్మ అది చూసి అయిష్టంతో అన్నది:

'ఛీ! అంత పెద్ద పగడాలు నీ కేం బాగుంటాయి? నీ కోసం ఎంత బుల్లి బుల్లి పగడాలు చుట్టించానో చూడు! అవి వేసుకో'

తను వినలేదు. మారాంపెట్టింది: 'నా కక్కరలేదు! నా కివే బాగున్నాయి!' అమ్మ ఎంతో చెప్పి చూసింది. ఊహు...ఏంలాభం లేకపోయింది...ఆ దెయ్యంలాంటి పగ డాలు వేసుకునే ఆడుకుందుకు వెళ్ళింది. ఆ బరువుకు మెడ నొప్పిగావుండేది.పొడుగాటిదండ తను గెంతినప్పుడల్లా తనతో

జాటు ఎగిరిపడేది. క్రొత్తనగలు వేసుకున్న ఆనందంలో తను ఇవేవీ లెక్క చేయలేదు. నిమిషంలో ఆటల్లో మునిగిపోయింది. ఆ సందట్లో ఆ క్రొత్త దండ సంగతే మరచిపోయింది.

ఆ వేళ ప్రొద్దుగూకి అలసిపోయి తను ఇంటికివస్తే, అమ్మ వేన్నీళ్లుపోసి, వెండి కంచంలో అన్నంపెడుతో కంగా రుగా అడిగింది.

'అమ్మో! పగడాలేవే?'

అదరిపోయి, బిక్క మొహంవేసుకుని మెడ తడువు కుంది తను. పగడాలు లేవు; ఆటల హడావిడిలో వాటి గొడవే పట్టలేదు తనకు. ఎప్పుడు పడిపోయిందీ – ఎక్కడ పడిపోయిందీ కూడా తెలీదు.

కోపంతో, దిగులుతో అమ్మ చీదరించుకున్నది: 'వద్దని ఎన్నిసార్లు చెప్పినా విన్నావు కాదు. నిమిషంలో పారేసుకు చక్కావచ్చావు. ఛీ'

ఆతరువాత, నాన్న, అమ్మా ఇద్దరూ కలసి తనని ఎన్నో ప్రశ్నలువేశారు. ఆ మర్నాడంతా కూడా, ఆ ప్రశ్నల వర్షం ఆగలేదు. ఎంతమంది ఎన్నిసార్లు తనని పదే పదే అవే ప్రశ్నలు అడిగారో! జవాబు చెప్పలేక తనకి విసుగూ, కోపమూ, ఏడుపూ వచ్చేవి.

'ప్రొద్దుటినుంచి ఎక్కడెక్కడ తిరిగావు!'

'ఎక్కడ ఆడుకున్నావు?'

'ఎవరితో ఆడుకున్నావు?'

'పగడాలు ఆఖరుసారి ఎప్పుడు చూచుకున్నావు!'

ఇట్లాగ ఎన్నో ప్రశ్నలు అడిగారు. తను అన్నింటికీ తనకి తోచినట్లు ఏవో తెలిసీ తెలియని జవాబులు చెప్పింది.

'మండువాలో ఆడుకున్నాను' 'మేడమీద గదిలో సావిత్రితో ఆడాను' 'పగడాలు అప్పుడప్పుడు చూసుకుం టూనే వున్నాను' అని ఏవేవో చెప్పింది, కాని ఎందుకో చాల సేపు దుకాణందగ్గర సీతతో ఆడుకున్నాననిమాత్రం చెప్పలేదు. అమ్మ ఏమంటుందోనని, సీతని తాతని ఏమన్నా అంటారేమోనని భయపడింది.

ఆ రాత్రి పన్నెండింటివరకూ అమ్మా నాన్నా ఇల్లంతా వెతుక్కున్నారు ఎక్కడా పగడాలు దొరకలేదు. భయంతో దిగులుతో, ఏడుస్తో నిద్రపోయింది. తెల్లవారి మళ్ళీ ఇంటిల్లపాదీ మూలమూలలా వెతికారు. చుట్టుపక్కల అందరికీ తెలిసింది పగడాలు పోయాయని; ఇరుగూ, పొరుగూ అంతా పరామర్శకి వచ్చారు. సాంత్వనవాక్యాలు పలికేవారు, సలహాలు చెప్పేవారూ, అంతులేదు.

'అన్ని చోట్లా బాగా వెతికారూ ?'

'పాపం పాతిక రూపాయలసొమ్ము'

'ఎవరైనా తీసివుంటారేమో —ఎవరిమీదనైనా అనుమానం వుందా ?'

ఇట్లాగే ఎన్నో ప్రశ్నలూ, వాక్యాలూ. పాపం అమ్మ మాత్రం అందరికీ ఓపికగా, విమర్శగా, జవాబు చెప్పేది. అసలు ఆవిడకి చెప్పిందే మళ్ళీ మళ్ళీ విపులంగా చెపుతుంటె ఎంతో ఉత్సాహంగా, సరదాగా వుండేది. వస్తువు దొరికినట్లే వుండేది.

ఎనిమిదయ్యేసరికి ప్రక్కవీధినుంచి బాబాయ్ వచ్చాడు. వస్తూనే తన వంతుకి ప్రశ్నలవర్షం ప్రారంభించాడు. అమ్మని అడిగాడు:

'పగడాలు ఎప్పుడువేశావు?' 'మళ్ళీ ఎప్పుడు చూశావు?' అంటూ. అమ్మ ఏదో చెప్పింది. హఠాత్తుగా బాబాయి అడిగాడు:

'రోజూ ఆడుకోటానికి ఆ ముసిలాడి కొట్టు దగ్గరికి పోతుంటుందిగా! నిన్న పోలేదూ?'

అమ్మ విస్తుపోయింది, ఇంత స్పష్టమయిన విషయం తన కింతవరకూ తోచనందుకు. ఆమె మందబుద్ధికి ఎంతో నొచ్చుకుంటూ ఎక్కడో మూల దాక్కున్న తనను పిలిచి అడిగింది.

'ఏమే! నిన్న సీతతో ఆడుకోడానికి పోలేదూ?'

...'ఎప్పుడో ప్రొద్దున వెళ్ళాను' అని భయపడుతో చెప్పింది తను.

బాబాయి వెంటనే నిర్ధారణకి వచ్చాడు. 'ఇంకేం! ఆ గుడిసె దగ్గరే ఆడుకుంటూ వుంటే పడిపోయి వుంటుంది. ఆ ముసిలాడే తీసివుంటాడు' అన్నాడు.

అమ్మ అదే సమర్ధించింది:

'అవును; తప్పకుండా వాడే తీసివుంటాడు. అసలు వాడు రోజూ అమ్మడిని ఇంట్లోంచి వెండి బంగారం చిల్లర ముక్కలన్నీ తీసుకురమ్మని అవన్నీ కాజేస్తుండేవాడు.'

తను నిర్ఘాంతపోయింది. 'అబద్ధం!! తాత తనెన్నప్పుడూ ఆ ముక్కలు తీసుకురమ్మని అడుగలేదు. తనే ఆ

మూలా ఈమూలా దొరికినవన్నీ ప్రోగుచేసుకొనిపోతే, తాత వట్టినే సరదాకు, తనని సంతోషపెట్టడంకోసం అవన్నీతీసుకుని దాచేవాడు'—ఈ మాటలు గట్టిగా అరచి అమ్మకు చెప్పా లనుకున్నది. కాని ఆ సందట్లో గొడవలో నోరు విప్ప లేకపోయింది.

బాబాయ్ వెంటనే వెళ్ళి తాతను పిలుచుకొచ్చాడు. మండువాలో పంచాయితీ ప్రారంభమైంది. బాబాయ్ నోటికి వచ్చినట్లు కేకలువేసి చీవాట్లుపెట్టి తాతని ఎంతో బాధ పెట్టాడు. 'ప్రొద్దుటినుంచి నీ గుడిసెముందరే ఆడుకున్నది పిల్ల. నీవు తీయకపోతే ఎవరు తీస్తారు?' అన్నాడు.

తాత ఆ మాటలు వినబడనట్లూ, అర్థంకానట్లూ నిర్ఘాంతపోయి తెల్లమొహంవేసుకు నించున్నాడు. నలు గురూ ఏమంటున్నదీ అతను సరిగా వినిపించుకోలేదు. అవ మానంతో, బాధతో కృంగిపోయి నించున్నాడు. రెండు మూడుసార్లు దీనంగా అన్నాడు.

'నేను ఎరుగనండీ... బుల్లెమ్మగారి మెడలో పగడాలు అసలు నేను చూడనేలేదు.' ఇంకోమాటు అతి జాలిగా అన్నాడు.

'బుల్లెమ్మగారిని మా సీతకన్నా ఎక్కువగా చూసు కుంటున్నాను. ఆమెవంటిమీద వస్తువు ముట్టుకుంటానాండి?'

అయినా, అతని మాటలు ఎవరూ వినిపించుకోలేదు. అమ్మ అన్నది:

'ఏదో తీసుకున్న వస్తువు మంచిగా యిచ్చేయి! ఎందుకు అనవసరంగా అల్లరిపాలవుతావు!'

'నేను తియ్యండే! నా దగ్గర లేండే!' అని స్పష్టంగా గొణుక్కుంటూ, అమ్మమాటలు వింటూ విస్తుపోయి నించు న్నాడు తాత.

బాబాయ్ అన్నాడు. 'చూడు లక్ష్మన్నా, మెల్లిగా మర్యాదగా అది ఇచ్చేసి దండంపెట్టు, లేకపోతే ఇంక పోలీసు లకు రిపోర్టు ఇవ్వాలిసివస్తుంది. పోలీసులచేతులో పడితే ఏమవుతుందో నీకు తెలుసుగా!'

పోలీసుపేరు వినగానే తాత అదిరిపోయాడు. భయంతో గజ గజ వణికాడు. నోట మాటరాలేదు.

ఆ సమయానికే దారినిపోతూ, పోలీసు నరసయ్య లోపలికి వచ్చాడు - లాఠీకర్ర ఊగించుకుంటూ. బాబాయ్‌ని చూసి అడిగాడు:

'ఏమిటండీ ? ఏమిటి సంగతి ?'

'ఏంలేదోయ్' అంటూనే బాబాయ్ అంతా మొదటి నుంచి సవిస్తరంగా ఒక కథలా చెప్పాడు.

పోలీసునరసయ్య తాతని బెదరిస్తూఅన్నాడు: 'ఏం వోయ్ ఎందుకూ- ఏదో చప్పున తేల్చుకో... లేకపోతే స్టేష నుకునడవాలసిందే ' అని, లాఠీకర్ర ఠీవిగా నేలమీద తడుతూ తాతకేసి గుడ్లురిమి చూశాడు.

తాత దుఃఖంతో మతిపోయినవాడిలా నించున్నాడు. అతని కళ్ళల్లో నిరాశ తనని చుట్టుకుని దహించివేస్తోంది. సీత తాత కాళ్ళకు పెనవేసుకుని భోరున ఏడ్చింది. తనకీ ఏడుపొచ్చింది. తనూ ఏడ్చింది.

ఒక్కక్షణం ఏమీ దిక్కుతెలియనివాడిలా, నిద్రలో నడుస్తున్నట్లు కొట్టుదగ్గరికి వెళ్ళాడు తాత—అతను ఎన్నాళ్ళనుంచో ప్రాణప్రదంగా దాచుకుంటున్న సీనారేకుడబ్బా పట్టుకొని మళ్ళా వచ్చాడు. డబ్బా తెరిచి నలిగిపోయి ఉండలా ముడిచివున్న ఎప్పటిదో పాత పదిరూపాయలనోటు తీసి బాబాయ్‌కిస్తూ అన్నాడు:

'బాబూ! పగడాలు నేను చూడలేదు. కాని. ఇది తీసుకొని నన్ను విడిచిపెట్టండి. బీదవాణ్ణి. ముసలివాణ్ణి, కళ్లు కూడా సరిగా కనపడటంలేదు. నన్ను హింసపెడితే మీకేమొస్తుంది బాబూ! !'- అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు.

అందరూ కూడబలుక్కొని పగడాలు దొరకనప్పుడు డబ్బు తీసుకోవడమే మంచిదనుకున్నారు. అమ్మ అన్నది:

'పాతికరూపాయలపగడాలు! పదిరూపాయలేమిటి?—ఏదో ఎరుగున్నవాడివని చూస్తున్నాం—ఇంకోపదయినా వేసుకో !'

'అవును అంతే' అన్నాడు బాబాయ్.

బాధపడుతో, ఏడుస్తో, మళ్లీ డబ్బాలో తడిమి ఇంకో మూడురూపాయబిళ్ళలు తీసి బాబాయ్‌చేతిలో పెట్టాడు.

తాత వణికిపోతున్న కంఠంతో అన్నాడు: 'నాకున్న ఆస్తంతా ఇదేనండి ఇంక నన్ను చంపినా ఇంతకన్న ఇచ్చుకోలేనండి.'

ఖాళీడబ్బా చేయిజారి క్రిందపడి ఖంగున మ్రోగింది.

బాబాయ్ ఏదో అనబోయినాడు; కాని, ఇంతవరకు తన కేమీ సంబంధములేనట్లు అమ్మనోటికి జడిసి మౌనంగా కూర్చున్న నాన్న అందుకున్నారు:

'పోనిద్దురూ! ఆ ముసిలాడిని ఎందుకు బాధపెట్టుతారు;'

దాంతో, బాబాయ్ ఊరుకున్నాడు. అమ్మా ఊరుకున్నది.

సీతచేయి పట్టుకుని అడుగులు లెక్కపెట్టుకుంటూ తాత వెళ్ళిపోయాడు.

తల తడుముకుంటూ, ఏదో ఘనకార్యం చేసినట్లు 'అయ్యా! తమ దయ!' అంటూ, చేయి చాపాడు పోలీసు నరసయ్య. రెండురూపాయలు చేతిలో వేయించుకుని దారి పట్టాడు. మెల్లి మెల్లిగా అందరూ ఎక్కడవాళ్ళక్కడ కెళ్ళిపోయారు.

తనుమాత్రం మండువాలో అట్లానే కూర్చుంది. కన్నీళ్లు ఆగకుండా ఏకధారగా కారాయి. తనకి స్పష్టంగా తెలుసు: తాత తన పగడాలు తియ్యలేదు; తియ్యడు. కాని ఈ మాట నలుగురితో చెప్పలేకపోయింది. అనవసరంగా తాతకి బాధకలుగుతూంటె చూస్తూ ఊరుకున్నది.

ఒక్కసారి పరుగెత్తుకువెళ్ళి తాత చేయి పట్టుకుని చెప్పాలనిపించింది: 'నాకు తెలుసులే తాతా! నీవు నా పగడాలు తీయలేదనీ, ఏమనుకోబోకు!!' అని. గుమ్మందాకా వెళ్ళింది. కాని, వెనకాలే అమ్మ వచ్చి, రెక్కలు పట్టుకుని లోపలికి లాక్కుపోయింది.

—ఆ తరువాత అమ్మ ఎప్పుడూ తనని తాతదుకాణం చాయలకుపోనివ్వలేదు. ఓనాడు మేడమీద గదిలో పోలమ్మ గది ఊడుస్తుంటే, బీరువాక్రిందనుంచి పగడాలు ఎగిరి బయటపడినవి. తను కివ్వున ఒక్క గంతువేసింది. పోలమ్మ కెవ్వున ఒక కేక పెట్టింది:

'అమ్మగారూ! పగడాలిక్కడుండాయండీ!'

అమ్మ గబగబా మేడమీదికి వచ్చింది. ఎర్రగా, పడివున్న పగడాలదండ చూసి విస్తుపోయింది. సంతోషంతో సిగ్గుతో, పగడాలు చేతులోకి తీసుకుని అన్నది: 'ఇల్లంతా గాలించాముగాని, ఈ బీరువాక్రింద చూడాలనితోచనేలేదు.'

'ఇంతకీ అంతా ఆ ముసలాడి కర్మమమ్మా! ఎవరేం చేస్తారు!!' అని విదలించుకుంటూ పోలమ్మ తీర్పు చెప్పింది. చీపురు ఊపుకుంటూ వెళ్ళిపోయింది.

తను ఉత్సాహంగా అమ్మదగ్గరకు పోయి అన్నది:

'తాతతో చెప్పిరానా అమ్మా, పగడాలు దొరికాయని'

అమ్మ కంగారుగా పగడాలు పమిటకు వత్తుకుంటూ చీవాట్లుపెట్టింది: 'ఛీ! సొమ్ము ఇంట్లోనే ఉంచుకొని వాడిని ఉత్తినే హింసపెట్టామని నలుగురూ అనుకోరూ? ఎంత అప్రతిష్ట!!'

తన కేమీ అర్థం కాలేదు. కారణం లేకుండానే దొంగ తనంచేశాడని అపవాదువేసి బాధపెడితే తాతకి ఏమీ అవ మానం, అమర్యాదలేదు. కాని దొరికిన వస్తువు దొరికిందని చేసిన తప్పు ఒప్పుకోవడం తమ కెంతో అమర్యాద! అప్రతిష్ఠ!

పగడాలు దొరకగానే అమ్మ తాతని పిలిచి అతని రూపాయలు అతని కిచ్చివేస్తుందనుకున్నది తాను. కాని, అల్లాజరుగలేదు. పైగా, పోలమ్మకికూడా ఏంచెప్పిందోఏమో, అసలు పగడాలు దొరికాయన్నమాటే బయటికిరాలేదు. తన మనస్సులో మాత్రం ఏదో తీరని బాధ అల్లానే నిలిచి పోయింది. అతనికి తమకుచేసిన తీరని అన్యాయం, అతని చెమటచుక్కలతో లెక్కపెట్టి తీసుకున్న రూపాయలు హృదయంలో శాశ్వతంగా ఏదో భారంగా వుండిపోయినవి.

చాలా రోజులవరకు తాత ఈ అఘాయిత్యంనుంచికోలుకోలేదు. అవమానంతో రోజు రోజూ కృంగి కృశించి పోయాడు. వ్యాపారం బొత్తిగా పడిపోయి క్రమంగా దుకాణమే ఎత్తేశాడు. సీత కొంచెం ఎదిగి పనికి పోతుండేది. దాంతోటే వాళ్లు ముగ్గురూ, ఎల్లాగో కాలం గడుపుకుంటూ వుండేవాళ్ళు.

ఎన్నోసార్లు, తను డాబామీద నుంచునివుంటే గుడిసె గుమ్మందగ్గరనుంచి సీతా, తాత ఇద్దరూ తనకేసి ఎంతో జాలిగా, ఆప్యాయంగా, దీనంగా చూస్తుండేవాళ్లు. తను సిగ్గుపడి కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపొయ్యేది.. ఆఖరుకి తమకు ఆ ఊరునుంచి వెళ్ళిపొయ్యేటప్పుడుగూడా, బండి పోతుంటె, తాత వాకిట్లోకి వచ్చి తనకేసి ఎంతోసేపు చూశాడు—ఎంతో మమకారంతో, కన్నీళ్ళతో, పాపం; అంత బాధపడినా తనని మరచిపోలేదు.

ఆ కన్నీళ్ళతో తనని ఏమని ఆశీర్వదించాడో! అతని అమాయకపు ప్రేమ నీడలా తన హృదయాన్ని చుట్టుకొన్నది. తనని కాపాడింది.

ఎన్ని రోజులు గడచినా, ఎన్ని మార్పులు వచ్చినా, తను మాత్రం ఎప్పుడూ తాతని మరచిపోలేదు. మెళ్ళో ఆ పగడాలు కదలినప్పుడల్లా తాత జ్ఞాపకంవస్తూనే వుంటాడు. ఎన్నోసార్లు, తాతఋణం తీర్చుకోవాలని తాపత్రయపడింది. కాని, అమ్మకు జడిసి, మొహమాటంకొద్దీ ఏమీ చేయలేకపోయింది.

మఱ్ఱిచెట్టు ఊగి, చల్లగాలి తిరిగింది. క్రిందనుంచి అమ్మ కేకేసింది: 'అన్నానికి వస్తావా! నాన్న వచ్చారు!'

మెల్లిగా లేచి. పాపకి దుప్పటికప్పి, క్రిందకు వెళ్ళింది. భోంచేస్తూ, అమ్మని అడిగింది:

'మన ఇంటికెదురుగా ఉండేవాళ్ళు-ఆ ముసిలితాతా, సీత వాళ్లు ఏమైనారమ్మా?'

అమ్మ ముఖం చిట్లించుకున్నది. 'ఏమో! ఎప్పుడో నాలుగేళ్లక్రిందటే కాటకం వచ్చినప్పుడు ఆ ముసలాళ్ళిద్దరూ పోయారట. ఆ తరువాత వాళ్ళ చుట్టమెవడో వచ్చి సీతను తీసుకుపోయాట్ట. ఎక్కడుందో! ఏమో!' అన్నది. అబ్బ! తనకి గుండె పగిలే విషయంలో అమ్మకి ఎంత నిర్లక్ష్యం!!

తనకి అన్నం సయించలేదు. గబగబా రెండు మెతుకులు తిని మళ్లీ డాబామీదకు వెళ్ళిపోయింది. వెనకాల అమ్మ అరుస్తూనే వుంది:

'అదేమిటే ! అన్నమే తినలేదు !!' అని.

ఎడమచేత్తో ఇంకా రబ్బరుబొమ్మని గుండెల కదుముకుని పాప హాయిగా, అమాయకంగా, నిశ్చింతగా, నిద్దరపోతోంది—తనకి కళ్లనీళ్ళు తిరిగాయి — మంచంమీద కూర్చుని, ముందుకువంగి పాప ముంగురులు సరిదిద్దింది. మెడలో పగడాలు ముందుకు వ్రేళ్ళాడి పాప పెదవులని తాకాయి—ఆ వెన్నెలరాత్రి, ఆకాశాన ఏ మూలో ఓ చుక్క రాలిపోయింది.

పాపకళ్లల్లోకి చూస్తో, తనకి నిద్దరతూగింది. గుండెల్లో బరువుగా కొట్టుకున్నాయి పగడాలు !!